క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. గణపవరంలోని చవిటిపాలెం, రాజీవ్‌గాంధీకాలనీ, తిమ్మాపురం డొంకలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

యడ్లపాడు: మండలంలోని కొత్తపాలెం(పుట్టకోట) గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ చిలకలూరిపేట డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనులలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఆయన కోరారు.

దాసునాయన మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, నరసరావుపేట అఖిలపీఠం పీఠాధిపతి చిమటా వెంకటరావు శిష్యుడు పుల్లారావు, ఫిరోజ్ పీఠం అధిపతి పోకల వెంకటరావు, గుంటూరు బ్రహ్మంగారి పీఠం అధిపతి సుగుణ ప్రవచనాలు వినిపించారు. భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కొత్తపాలెం మాజీ సర్పంచ్ గురవయ్య మృతి



యడ్లపాడు: అనారోగ్య కారణంగా కొత్తపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పల్నాటి గురవయ్య(60) మృతి చెందారు. 2001-2006 మధ్య కాలంలో ఆయన సర్పంచ్‌గా కొనసాగారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ పార్టీలోనూ ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య కుమారి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి సమాచారం తెలుసుకుని వైఎస్సార్‌సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ సమన్వయకర్త, కమిటీ సభ్యులు రాచమంటి చింతారావు, కొత్తపాలెం సర్పంచ్ మానం సాంబయ్య, నాయకులు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

ఇర్లపాడులో ఉచిత వైద్య శిబిరం



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో జన విజ్ఞాన వేదిక సారథ్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి మార్కాపురం వైద్య కళాశాల అధ్యాపకుడు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీ, షుగర్, కంటి జబ్బులు తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో 85 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందులు అందజేశామన్నారు. ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని, ఆహార నియమాలు పాటించాలని తెలిపారు.

వైభవంగా శివాజీ మహరాజ్ దివస్



సత్తెనపల్లి: ఛత్రపతి శివాజీ మహరాజ్ దివస్ ఊరేగింపు పట్టణంలో ఆదివారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ శివాజీ మహరాజ్ దక్షిణ దివస్ యాత్ర సందర్భంగా విజయవాడ దుర్గమ్మ దేవస్థానం నుంచి మంగళగిరి, గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట, త్రిపురాంతకం, దోర్నాల నుండి శ్రీశైలం దేవస్థానం వరకు యాత్ర జరుగుతుందన్నారు. దక్షిణ దిగ్విజయ యాత్రలో భాగంగా ఈ నేలపై మరాఠా సైన్యం అడుగు పెట్టి 2025కి 348సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహరాజ్ దిగ్విజయ దివస్ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. శివాజీ యూత్ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఖర్చు తగ్గించుకుంటున్నారు..!

- డ్రమ్ సీడరుతో వరి సాగు చేపట్టిన రైతులు
- తగ్గుతున్న పెట్టుబడి వ్యయం



డ్రమ్ సీడరు పరికరంతో విత్తనాలు వెదజల్లుతున్న దృశ్యం

శావల్యాపురం: మండలంలో అధికంగా వరి సాగుకు అన్నదాతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడి వ్యయం పెరగడంతో రైతులు యంత్ర పరికరాల ద్వారా వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వరి నాట్లు మొదలుకుని.. కలుపు తీసే పరికరాలు, పురుగుమందుల పిచికారీకి అధునీకరణ యంత్రాలను, వరి కోత యంత్రాలను వినియోగించి కూలీలకు అయ్యే ఖర్చు తగ్గించుకుంటున్నారు. గతంలో ఒక ఎకరం వరి నారు కొనుగోలు చేసి నాట్లు వేయాలంటే రూ.10 వేలు ఖర్చు అయ్యేది. డ్రమ్ సీడరు ద్వారా ఒక ఎకరానికి కేవలం 15 కేజీల వరి విత్తనాల వెదజల్లటానికి రూ.1,600 మాత్రమే ఖర్చు అవుతుంది. శావల్యాపురం- 250, పోట్లూరు- 150 ఎకరాల్లో డ్రమ్ సీడరు ద్వారా వరి నాట్లు వేయు విధానాన్ని రైతులు చేపట్టారు. ప్రస్తుతం మండలంలో డ్రమ్ సీడరు యంత్ర పరికరంతో వరి నాట్లు సాగు వేస్తూ కూలీలకు అవుతున్న ఖర్చును గణనీయంగా తగ్గించుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు జేజీఎల్ 384, కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలను పంట సాగుకు రైతులు వినియోగిస్తున్నారు.

పదవులు పొందిన వారు పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పుల్లారెడ్డికి సూచించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని కలిసిన పుల్లారెడ్డి, నాయకులు

నరసరావుపేట: పదవులు పొందిన వారు పార్టీ పటిష్టతకు కృషి చేసి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కనకా పుల్లారెడ్డి తన అనుయాయులు, నాయకులతో పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఉప్పలపాడు గ్రామ పెద్దల ఆశీస్సులతో పుల్లారెడ్డికి పదవి లభించిందని, అందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉప్పలపాడు గ్రామం 2014, 2019, 2024 ఎన్నికల్లో పార్టీకి ఏకపక్షంగా మద్దతుగా ఉందని, అటువంటి గ్రామానికి చెందిన వ్యక్తికి పదవి లభించటం సముచితంగా ఉందన్నారు. ఆ గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లపుడూ ఉంటుందన్నారు. పుల్లారెడ్డి గ్రామంలోని వారందరినీ కలుపుకొని పోయి పార్టీ బలోపేతానికి, వచ్చే 2029 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర, అచ్చి శివకోటి, బీసీ సెల్ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, మాజీ మండల కన్వీనర్ మోరబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వెంటప్పారెడ్డి, నాయకులు మూరే రవీంద్రరెడ్డి, సర్పంచ్ భవనం నరిసిరెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, ఏసిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్‌పై న్యాయవాది రామకోటేశ్వరరావు.
- టీడీపీ నాయకుల ఆరోపణలు ఖండించిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

వినుకొండ: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు, న్యాయవాది రామకోటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ అధ్యక్షుడు గంధం హరిప్రసాద్, కార్యదర్శి అమ్మిరెడ్డి మల్లికార్జునరెడ్డి, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ న్యాయవాది రామకోటేశ్వరరావుపై ఎం.ఎన్.ప్రసాద్‌కు తప్పుడు కేసులు పెట్టించాల్సిన అవసరం లేదని, గతంలో ఆయన కొప్పుకొండ గ్రామంలోని దేవాలయ భూములను ఆక్రమించుకొని చేపల చెరువులు సాగు చేశారని, చేపల చెరువుల్లో నీటిని గేదెలు తాగి అస్వస్థతకు గురవుతున్నాయని గ్రామస్తుల ఫిర్యాదు మేరకే అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని అన్నారు. వ్యక్తిగత దూషణలు చేయడం, బెదిరించడం వంటి చర్యలు టీడీపీ నాయకులు మానుకోవాలని, బెదిరిస్తే భయపడేవారు ఎవరూ లేరని హెచ్చరించారు. వినుకొండ బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎం.ఎన్.ప్రసాద్ సొంత నిధులు ఖర్చు చేసి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో నూతన భవనం నిర్మించారని, అది ఓర్వలేని కొందరు టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నియోజకవర్గ ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షుడు న్యాయవాది జంపఖానాల షేక్ నాగూర్‌మీరావలి, వినుకొండ మండలం ఆర్టీవో విభాగం అధ్యక్షుడు న్యాయవాది టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా అయ్యేలా చర్యలు

ఏవో రామారావు

శావల్యాపురం: రైతు సేవా కేంద్రాలకు యూరియా బస్తాలు మంజూరు చేస్తామని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. ఆదివారం సాక్షిలో వచ్చిన 'ఆర్బీకేల ద్వారా యూరియా సరఫరా చేయాలి' కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి, పిచికలపాలెం, మతుకుమల్లి, కొత్తలూరు, పోట్లూరు, శానంపూడి తదితర రైతు సేవా కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. శావల్యాపురం, కారుమంచి సొసైటీల పరిధిలో రైతులకు యూరియా అందుబాటలో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలోని ప్రైవేటు దుకాణాల్లో యూరియా సరఫరా కావటం లేదని ఏవో తెలిపారు. పంటలు సాగు ఆధారంగా రైతులు యూరియా ఎరువులు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు



వినుకొండ: మండల స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు, మండల జట్ల ఎంపికలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జఫ్రుల్లా తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలోని జెడ్పీహెచ్ పాఠశాల క్రీడా మైదానాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెలాఖరులో జరిగే డివిజనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరప్పయ్య, పీడీలు జి.వీరాంజనేయులు, ఆర్.రాధాకృష్ణమూర్తి, పీఈటీలు వెంకటేశ్వర్లు, జోనానాయక్, కొండలు, వెంకటేష్, అశోక్, ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామ సభలు



బొల్లాపల్లి: మండలంలో సామాజిక తనిఖీ గ్రామ సభలు ముగిశాయి. ఆదివారం మండలంలో అయ్యన్నపాలెం, మేకలదిన్నె, లాలిపురం, సీతాపురం తండా, బండ్లమోటు, బొల్లాపల్లిలో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామ సభల్లో పనుల తనిఖీలకు సంబంధించిన నివేదికను చదివి వినిపించారు. గ్రామ సభల్లో ఎస్ఆర్పీ బి.ఆవులయ్య, ఏపీవో పి.వెంకటేశ్వర్లు, డీఆర్పీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎవరు..!?



నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయం

నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా బదిలీపై ఎవరు రానున్నారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. గత నెల 13న తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ బదిలీపై అచ్చంపేట మండలానికి వెళ్లిన విషయం విదితమే. తహసీల్దార్ బదిలీ అయి మూడు వారాలు గడుస్తున్నా నేటి వరకూ ఖాళీగా ఉండటంతో రెవెన్యూ పనులు నెమ్మదించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకూ వందల సంఖ్యలో అర్జీలు, దరఖాస్తులు పెండింగ్ పడిపోయాయి. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్న షేక్ సల్మాన్ డిజిటల్ సిగ్నేచర్ అధికారం లేకపోవటంతో కొన్ని విధులకే పరిమితమయ్యారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు మాత్రమే జారీ చేస్తున్నారు. పాస్‌పుస్తకాలు, అడంగలు నమోదు వంటి వాటి కోసం ప్రతి రోజూ లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరిగి పనులు జరగక వెనుదిరుగుతున్నారు. నాదెండ్ల తహసీల్దార్ పోస్టు కోసం ఐదుగురు అధికారులు పోటీలో ఉన్నట్లు సమాచారం. స్థానిక నాయకుల ఆశీర్వాదంతో తహసీల్దార్‌గా బదిలీపై వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వారు కూడా బదిలీపై తిరిగి ఇక్కడకు రావాలని లాబీయింగ్ ముమ్మరం చేశారు. త్వరితగతిన తహసీల్దార్ పోస్టు భర్తీ చేయాలని, లేకుంటే ఇన్‌చార్జి తహసీల్దార్‌కే డీఎస్ పవర్ అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ జున్నుసాహెబ్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారం



యడ్లపాడు: మండలంలోని కొండవీడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఎస్జీటీ డాక్టర్ షేక్ జున్నుసాహెబ్‌ను మరో పురస్కారం వరించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు కేవీఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏటా అందించే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ఆచార్యులు కె.రత్నషీలామణి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, మెడికల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఎస్.వీరప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ, కేవీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు, కార్యదర్శి కె.అలీస్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎం.నాగరత్నం, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భారీ వర్ష బీభత్సం.. రాకపోకలకు అంతరాయం!



యడ్లపాడు: మధ్యాహ్నం వరకు వేసవిని తలపించేలా మండుటెండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఊరటనిచ్చింది. కారుమబ్బులు దట్టంగా అలుముకుని, ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఈదురు గాలుల తీవ్రతకు బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే మార్గంలో పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. ముఖ్యంగా గురుకుల పాఠశాల మార్గం నుంచి సంగం గోపాలపురం వరకు ఆర్ అండ్ బీ రహదారిపై పెద్ద పెద్ద చెట్లు అడ్డంగా పడటంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో విద్యుత్ లేకపోవడం, చెట్లు, కొమ్మలు రోడ్డుపై అడ్డంగా పడి ఉండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు రోడ్డుపై ఉన్న వాటిని అడ్డుతొలగించినట్లు సమాచారం.

ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం

ఆశావర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో డి.శివకుమారి, ఎం.రత్నకుమారి



సమావేశంలో శివకుమారి, మహిళా నాయకులు

నరసరావుపేట: ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే అనేక సమస్యలు పరిష్కరించుకోవడం జరిగిందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి.శివకుమారి పేర్కొన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు కె.చంద్రకళ అధ్యక్షతన పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ ఆశాల పోరాటాల ఫలితంగా రూ.1.50 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు, 180 రోజులు ప్రసూతి సెలవులు సాధించుకున్నామన్నారు. నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. గర్భిణులను గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రికి తీసుకువస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం టీఏ, డీఏలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆరున్నర ఏళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన వేతనాలే ఇప్పటికీ అమలవుతున్నాయన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రత్నకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు విశేష సేవలు అందిస్తున్న ఆశాలకు కనీస వేతనాలు, వారాంతపు సెలవులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెలవులు వర్తింపజేయాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల నియామకాలలో రాజకీయ జోక్యం ఉండకూడదని, ఏఎన్ఎం పోస్టుల భర్తీలో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల చివరి వారంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. భవిష్యత్తులో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కోశాధికారి ఎం.ధనలక్ష్మి, కమిటీ సభ్యులు ఎం.చిన్నమ్మాయి, షేక్ మెహరున్నీసా, పి.బుజ్జి, డి.రత్నకుమారి, కె.జోసెఫ్‌రాణి, ఎస్.విక్టోరియా పాల్గొన్నారు.

పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదాం



నార సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: చేయి చేయి కలుపుదాం .. పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదామని అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు గుండ్లపల్లి కృష్ణ ఆర్థిక సాయంతో పట్టణంలో పండ్లు మార్కెట్, వ్యాపార, వాణిజ్య కూడళ్లలో ఆదివారం పాలిథిన్ వాడకంపై అవగాహన కలగజేసి నార సంచులు పంచారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నేటి సమాజంలో పాలిథిన్ వాడకం సర్వసాధారణమైందని, దీంతో కలిగే అనర్థాలు కళ్ల ముందు కనిపిస్తున్నా అనేక మంది బాధ్యతారాహిత్యంగా ఉన్నారన్నారు. ఇంటికి వెళ్లేటప్పుడు వస్తువులను సగటు వ్యక్తి పాలిథిన్ సంచుల్లోనే తీసుకెళ్తున్నారని, అవి మానవాళికి పెను సవాల్ విసురుతున్నాయన్నారు. అటు మూగజీవాల ప్రాణాలను సైతం హరిస్తున్నాయన్నారు. పాలిథిన్‌తో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ చైతన్యం పెంచుకోవాలన్నారు. అప్పుడే వాటి నిషేధం పూర్తిగా జరుగుతుందని చెప్పారు. ఇప్పటి నుంచే పాలిథిన్ సంచులకు ప్రత్యామ్నాయంగా నార సంచులను వినియోగించాలన్నారు. లేకపోతే భవిష్యత్తు తరాలకు పెనుముప్పు తప్పదని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జ్యూట్ సంచిని తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. పాలిథిన్ సంచులు రోడ్లపై వేయడంతో మూగజీవాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పాటిబండ్ల రవి రాజా, సభ్యులు షారోన్ కుమార్, బాలాజీ నాయక్, బబ్బు, తీర్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



అమరావతి పురవీధులలో కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సంఘ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరేశ్వరాలయం గాలిగోపురం నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గణవేష్‌లో కవాతు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రాంత కార్యవాహ వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో వందేళ్లుగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తి, క్రమశిక్షణగల వ్యక్తులుగా ఆర్ఎస్ఎస్ తీర్చిదిద్దుతోందన్నారు. సంఘం స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని చిట్టచివరి గ్రామంలో కూడా హిందూ ధర్మం కోసం - దేశం కోసం పనిచేసే హిందువులను కలపడం కోసం ప్రతి గ్రామం - ప్రతి బస్తీలో ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే యోజనతో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా అమరావతి ఉప మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు గణవేష్ రావటం విశేషమన్నారు. శైవ క్షేత్రంపీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ హిందూ సమాజం అనేక వందల సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణంలో, అయోధ్య రామ పూజిత అక్షితలను ఇంటింటికీ చేర్చడంలో సంఘ కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు



సత్కారం అందుకున్న ఆర్యవైశ్య చలివేంద్ర సంఘ సభ్యులతో కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: వాసవి యువశక్తి సభ్యులందరూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీ వాసవి యువశక్తి బాధ్యుడు కొత్త రామకృష్ణ అన్నారు. వాసవి యువశక్తి ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి ఆదివారం గో సేవలో కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ వాసవి యువశక్తి సభ్యులు చాలా ఆసక్తిగా ఉన్నారని, సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. వాసవి యువశక్తి సభ్యులు కొల్లిపర నరసింహారావు, జవ్వాజి సుబ్బారావు మాట్లాడుతూ దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహించినందుకు ఆర్యవైశ్య చలివేంద్ర సంఘ సభ్యులందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, గో సంరక్షణశాల అధ్యక్షుడు పెండ్యాల మల్లయ్య, కొల్లిపర హరికృష్ణ, చిలకల వాసు, వనమా నాగేశ్వరరావు, అయినవోలు వాసు, చలం, భవిరిశెట్టి రంజిత్, సుబ్రహ్మణ్యం, లఘుమవరపు రమేష్ బాబు, శ్రీ వాసవి యువశక్తి సభ్యులు అనీలు, మోహన్, పుల్లారావు, రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

150 మందికి గుండె పరీక్షలు



సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఎదురుగా ఉన్న ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏఆర్ సేవా సదన్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ విజయవాడ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ వైద్యులు ఎండీ డీఎం కార్డియాలజీ డాక్టర్ కార్తీక్ నాయుడు, పీజీ డీసీసీ డాక్టర్ నాగకిరణ్ వైద్య సేవలు అందించారు. సత్తెనపల్లి సమీప గ్రామాల నుంచి సుమారు 150 మంది వైద్య శిబిరంలో గుండె పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని ఎస్వీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిబిరంలో ఏఆర్ సేవా సదన్ ప్రెసిడెంట్ దేవండ్ల ఆదినారాయణ, సెక్రటరీ ఎస్డీ రఫీ అహ్మద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.